ప్రజాశక్తి
మంగళవారం 27 ఆగస్టు 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పాత పెన్షన్ విధానానికి..

ఏకీకృత పెన్షన్ పథకం ప్రత్యామ్నాయం కాదు

సిఐటియు అఖిల భారత కార్యదర్శి కెఎన్.ఉమేష్



మాట్లాడుతున్న ఉమేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ మంత్రివర్గం ఆమోదించిన ఏకీకృత పెన్షన్ పథకం పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం కాదని, దీనిని అందరూ వ్యతిరేకించాలని, పాత పెన్షన్ విధానం కోసం పోరాటాన్ని కొనసాగించాలని సిఐటియు అఖిల భారత కార్యదర్శి కెఎన్.ఉమేష్ అన్నారు. విశాఖపట్నం డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు - ఒపిఎస్ సాధనలో కార్మిక వర్గ పాత్ర' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాలలో త్వరలో జరగబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అక్కడ లబ్ధి పొందడం కోసమే ఏకీకృత పెన్షన్ విధానాన్ని మోడీ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. ప్రపంచీకరణలో అంతర్భాగంగా ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు 2004లో నూతన పెన్షన్ విధానాన్ని కాంగ్రెస్, బిజెపి రెండూ కలిపి తీసుకుని వచ్చాయని గుర్తు చేశారు. 97 లక్షల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ నిధులు రూ.10.68 లక్షల కోట్లు షేర్ మార్కెట్లో ఉన్నాయని, పెట్టుబడిదారులకు మరింత ప్రయోజనాలు చేకూర్చడం కోసం ప్రభుత్వ వాటాను 4.5 శాతం పెంచారని తెలియజేశారు. 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత నూతన పెన్షన్ విధానంలో పెన్షన్ గ్యారంటీ కల్పించారని తెలిపారు. కార్మికులు దగ్గర నుంచి ప్రతినెలా వసూలు చేసే పది శాతం కాంట్రిబ్యూషన్ లేకుండా పాత పెన్షన్ విధానంలాగనే అందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో ఏ వేతన సంఘం సిఫార్సులూ అమలు కాలేదని, పోరాటం చేయకుండా వేతన సంఘాలు ఏర్పడలేదని, చేసిన సిఫార్సుల అమలుకు పోరాటాలు చేయవలసి వచ్చిందని తెలిపారు. 8వ వేతన మిగతా 2లో..

ఫార్మా ప్రమాదంలో వంగర వాసి మృతి



సూర్యనారాయణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-వంగర (విజయనగరం)

పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ కంపెనీలో ఈ నెల 23న జరిగిన ప్రమాదంలో గాయపడిన విజయనగరం జిల్లా వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ (38) విశాఖలోని ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సూర్యనారాయణ పదేళ్ల క్రితం బతుకు దెరువు కోసం కంపెనీలో పనిచేసేందుకు పరవాడ వెళ్లాడు. ఆయనకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు పారంనాయుడు, గౌరమ్మ ఉన్నారు. భార్య సునీత 15 రోజుల క్రితమే మగబిడ్డకు జన్మినిచ్చింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళంని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ఫార్మా ప్రమాదాలన్నీ యాజమాన్యాల హత్యలే

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

వార్త 2లో..



పరుగు తీస్తున్న అభ్యర్థులు

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున ఆర్‌కె.బీచ్ వద్ద ప్రారంభమైంది. ఈ ర్యాలీ నిర్వహణకు పోర్టు స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ చేసినప్పటికీ రాత్రి కురిసిన వర్షం కారణంగా ట్రాక్ అంతా తడిసిపోయింది. బురదగా ఉండటంతో జారుతుందని భావించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచనతో అధికారులు ఈ ర్యాలీని బీచ్ రోడ్డులో నిర్వహించారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా అభ్యర్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేశారు.

పంచాయతీలకు ఊరట

◆ 15వ ఆర్థిక సంఘం నిధులు సర్దుబాటు ◆ రూ.79.10 కోట్లు విడుదల

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పంచాయతీలకు కొంత ఊరట లభించినట్లయింది. 15వ ఆర్థిక సంఘం నిధులు సర్దుబాటవడంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి కాస్త గట్టెక్కినట్లయింది. రోజువారీ నిర్వహణకు డబ్బుల్లేక అవస్థలు పడుతున్న పంచాయతీలకు ఊపిరిపోసినట్లయింది. జిల్లాలో 24 మండలాల్లోని 640 పంచాయతీలకు 2022 - 23 ఆర్థిక సంవత్సరంలోని మొదటి వాయిదా, ఈ కాలానికిగానూ వడ్డీ, 2022-23 ఆర్థిక సంవత్సర రెండో వాయిదా, 2023-24 ఏడాది తొలి వాయిదా కింద టైడ్, అన్‌టైడ్ నిధులు రూ.79.10 కోట్లు విడుదలయ్యాయి. 2022-23 తొలి వాయిదాలో అన్‌టైడ్ నిధులు రూ. 6.12 కోట్లు, టైడ్ నిధులు రూ.14.02 కోట్లు, ఈ కాలంలో అన్‌టైడ్‌కు వడ్డీ కింద రూ.10.56 లక్షలు, టైడ్ కింద రూ.16.48 లక్షలు, 2022-23లో రెండో వాయిదాలో అన్‌టైడ్ కింద రూ.11.61 కోట్లు, టైడ్ కింద రూ.17.57 కోట్లు, 2023-24లో తొలి వాయిదాలో రూ.11.79 కోట్లు, టైడ్ కింద రూ.17.69 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీలకు ఆర్థిక సంఘం విడుదల చేసిన అన్‌టైడ్ నిధులను పంచాయతీల నిర్వహణకు వినియోగించాల్సివుంది. తాగునీరు, శానిటేషన్, ఇతర ప్రజావసరాలకు టైడ్ నిధులను ఉపయోగించాలి. గత ప్రభుత్వంలో పంచాయతీల మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లుల కింద ఇపిడిసిఎల్‌కు ప్రభుత్వం జమచేసింది. ఈసారి పంచాయతీల ఖాతాలో ఆర్థిక సంఘం నిధులు జమవుతాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు పంచాయతీలకు జమైతే మిగతా 2లో..

ఎయు రిజిస్ట్రార్‌గా ధనుంజయ రావు

▶ వార్త 4లో..

912 కిలోల గంజాయి పట్టివేత

▶ వార్త 6లో..

మొదటి పేజీ తరువాయి..

ఏకీకృత పెన్షన్ పథకం ప్రత్యామ్నాయం కాదు

సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీకరణకు, ప్రైవేటీకరణకు, కార్మిక కోడ్స్ పేరుతో కార్మిక చట్టాల మార్పునకు వ్యతిరేకంగానూ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశాల ఐక్యతతో నేడు దేశంలో కార్మిక ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎఐఇఐఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని, కార్మికుల హక్కు అని సుప్రీంకోర్టు విశదీకరించిందని, 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాలు ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందని గుర్తు చేశారు. ఆయన చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ప్రకటించిన కేంద్రీకృత పెన్షన్ విధానం సరైనది కాదని, పాత పెన్షన్ విధాన సాధన కోసం ఐక్య పోరాటాలు కొనసాగించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సదస్సుకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ విధానమే మంచిదైతే దేశంలోని పార్లమెంటు, శాసనసభ్యులు అందరూ తీసుకోవాలని, వారు అనుభవిస్తున్న పాత పెన్షన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అమలు జరపాలని డిమాండ్ చేశారు. మోడీ మాయమాటలు నమ్మి ఏకీకృత పెన్షన్ విధానానికి వంత పాడొద్దని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్‌జిఒ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో గత ప్రభుత్వం చెప్పిన గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్‌కి, కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ఏకీకృత పెన్షన్ స్కీమ్‌కి పెద్దగా తేడా లేదని, అందరూ వీటిని వ్యతిరేకించాలని కోరారు. పాత పెన్షన్ విధాన సాధన కోసం ఎప్పటిలాగానే ఐక్య పోరాటం పోరాటం కొనసాగిద్దామని అన్నారు. రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జున సదస్సులో మాట్లాడారు. నావెల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఊరట

పంచాయతీ వర్కర్ల జీతాలు సహా రోడ్లు, కాలువలు, తాగునీటి పథకాల మరమ్మతులు చేపట్టడానికి వీలు కలుగుతుందని సర్పంచ్‌లు చెబుతున్నారు.

మండలాల వారీగా విడుదలైన అన్‌టైడ్, టైడ్ నిధులు

మండలం	పంచాయతీలు	రూ.కోట్లలో
అచ్యుతాపురం	34	3.94
అనకాపల్లి	32	4.53
బుచ్చెయ్యపేట	35	3.72
చీడికాడ	23	2.36
చోడవరం	32	4.50
దేవరాపల్లి	27	3.28
గొలుగొండ	27	2.81
కశింకోట	27	3.32
కె.కోటపాడు	32	2.94
కోటవురట్ల	25	3.04
మాడుగుల	29	3.64
మాకవరపాలెం	31	2.92
మునగపాక	26	2.72
నక్కపల్లి	31	4.52
నర్సీపట్నం	12	1.72
నాతవరం	31	3.38
పరవాడ	15	2.47
పాయకరావుపేట	24	5.24
రాంబిల్లి	26	2.34
రావికమతం	28	4.17
రోలుగుంట	24	2.76
సబ్బవరం	24	3.28
ఎస్.రాయవరం	28	4.06
యలమంచిలి	17	1.37

అలరిస్తున్న సంగీత, నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆరు రోజుల సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు మూడో రోజూ అలరించాయి. సోమవారం ఈ కార్యక్రమాలను ఈస్టర్న్ నేవల్ కమాండర్ ఎం.మురళీ మోహన్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విశ్వ విఖ్యాత కర్ణాటక ఈల పాట కళాకారుడు డాక్టర్ కె.శివప్రసాద్ బృందం కచేరీతో వీక్షకులను మైమరపించింది. కష్టమైన రాగాలాపన, స్వరకల్పనతో ఈల పాట రెండు గంటల పాటు సాగింది. కళాభారతి అధ్యక్షులు సత్యనారాయణ రాజు, రాంబాబు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమౌతున్న పోర్టు కార్మిక సంఘాలు

దేశ వ్యాప్తంగా కొలిక్కిరాని చర్చలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిటి) కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టనున్నారు. షరతుల్లేని వేతన ఒప్పందం తక్షణమే చేయాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో పెట్టిన బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వైజాగ్ పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న ఈ సమ్మె జరగనుంది. ఈ సమ్మెలోకి సిఐటియు, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, సిఎఫ్‌టియుఐ, ఐఎన్‌టియుసి, బిఎంఎస్ తదితర కార్మిక సంఘాలు కలిసి కట్టుగా దిగడంతో పోర్టు అధికారుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం కృష్ణాష్టమి సెలవు అయినప్పటికీ పోర్టుకు చెందిన హెచ్ఒడిల స్థాయిలో ఈ సమ్మె అజెండాపై సమావేశమయ్యారు. అదే సమయంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు, మహిళలు పోర్టులో సోమవారం సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేపట్టారు. బ్యాడ్జీలు పెట్టుకుని డిమాండ్స్ డేను సోమవారం పాటించారు. 28న సమ్మెకు సన్నద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. విశాఖ పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇచ్చేందుకు పోర్టు అధికారులు దాదాపు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్‌కు ఇవ్వొద్దంటూ ప్రధాన డిమాండ్‌గా చేర్చారు. పైన తెలిపిన డిమాండ్లతో పాటుగా అన్ని ఎంట్రీలెవెల్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్న అంశాన్ని విపిటి డిప్యూటీ ఛైర్మన్ దూబేకు అందజేసిన సమ్మె నోటీసులో కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. నేషనల్ మానిటైజేషన్ పేరుతో పోర్టు ఆస్తులను దేశ వ్యాప్తంగా మోడీ సర్కారు అమ్మకానికి పెడుతున్న తరుణంలో విశాఖలోగల సుమారు 7600 ఎకరాలకుపైగా స్థలాల్లో ఇప్పటికే ప్రైవేట్ వ్యక్తుల చొరబాటు మొదలైంది. రహేజా సంస్థకు చెందిన ఇనార్బిట్ మాల్‌కు శాలిగ్రాంపురంలోని పోర్టు స్థలం 17 ఎకరాలను ఇవ్వడాన్ని కార్మిక సంఘాలు నిరసిస్తున్నాయి. ఇలా భూములమ్ముకుంటూ పోతే ల్యాండ్ లార్డ్ పోర్టు సంగతి అలా వుంచితే ఏ ఆస్తులూ లేకుండా ఒట్టిగోడలతో మిగులుతుందంటూ పోర్టు కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. విశాఖ పోర్టులో సుమారు 1900 మంది వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారంతా ఈ సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.



పోర్టులోని వివిధ విభాగాల్లో సమ్మె ప్రచారం చేస్తున్న నాయకులు

ఫార్మా ప్రమాదాలన్నీ యాజమాన్యాల హత్యలే

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఫార్మా సిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యాల హత్యలే అని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. ఎసెన్షియా ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు చెల్లించిన విధంగానే పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ కంపెనీలో చనిపోయిన వారికీ రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండస్ ఆసుపత్రి ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనకు దిగారు. సినర్జిన్ ఫార్మా ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విజయనగరం జిల్లా వంగర మండలం కొంగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆందోళన చేపట్టారు. ఎసెన్షియా ఘటనలో ప్రధానమంత్రి ప్రకటించిన రూ.2 లక్షలు, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలను సినర్జిన్ మృతులకూ ఇవ్వాలని నినదించారు. ఈ ఆందోళనను ఉద్దేశించి కుమార్‌తో పాటు సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ కూడా మాట్లాడారు. ఫార్మా సిటీలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబరు 64ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమైన కంపెనీల యాజమాన్యాలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో విస్తారంగా ఫార్మా కంపెనీలు వున్నా ఒక్క సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆ ప్రాంతంలో బర్నింగ్ యూనిట్‌తో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించాలన్నారు. ఆందోళనకు స్పందించి సినర్జిన్ యాజమాన్యం, అధికారులు వెంటనే రూ.కోటి చెక్కును మృతుని భార్యకు అందజేశారు. దహన సంస్కారాలకు రూ.20 వేలు, పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులతో పాటు సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

నేడు మున్సిపల్ మంత్రి నారాయణ రాక

పలు అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ విశాఖ నగరంలోని జివిఎంసి, విఎంఆర్‌డిఎ కార్యక్రమాలపై సమీక్షించి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు మంగళవారం నగరానికి విచ్చేస్తున్నారు. దీంట్లో భాగంగా కాపులుప్పాడ వద్ద గల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ సమీక్ష చేపట్టనున్నారు. మంత్రితో పాటు జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొననున్నారు. ఆ తర్వాత జివిఎంసి కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశం కానున్నారు. 9 గంటల నుంచి 11 గంటల వరకూ విఎంఆర్‌డిఎ విజెపిసిఆర్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. మధ్యాహ్నం నుంచి స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు..

టిడిఆర్‌లపై చర్చ ఉంటుందా ?

రాష్ట్ర మున్సిపల్ మంత్రి స్వయంగా విశాఖకు విచ్చేస్తున్న సందర్భంగా గతంలో జివిఎంసి నుంచి అడ్డగోలుగా పొందిన ట్రాన్స్‌ఫరేబుల్ డవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)పై చర్చ జరగనుందా ? తగు చర్యలు తీసుకోనున్నారా ? అన్న చర్చ జివిఎంసి ఉద్యోగులు, అధికారుల్లో కొనసాగుతోంది. 2015 నుంచి ఈ టిడిఆర్‌ల సమస్య ఉంది. రూ.కోట్లలో అవినీతి భాగోతాలు నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పలు కుంభకోణాలు జరిగాయి. వీటన్నిటిపైనా మంత్రి ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. నగరంలోని మధురవాడ, గాజువాక, విశాఖ నగరం అంతటా ఈ టిడిఆర్‌ల కుంభకోణాలు గతంలో వెలుగు చూశాయి.

పాస్‌పోర్టు పోయినది

నేను వానపల్లి గోవింద, తండ్రి కళ్యాణం జి.కోడూరు నుంచి మాకవరపాలెం రోడ్డులో బైక్‌పై ప్రయాణం చేస్తుండగా మాకవరపాలెం ప్రవేశించే సమయంలో నా బ్యాగ్‌లో మాదగా నా పాస్‌పోర్టు పుస్తకం మరియు SSC Memo కనిపించడం లేదు.
నా పాస్‌పోర్టు నెంబర్ U8124704
మరియు SSC Roll No. 0832625
దొరికిన వారు దయచేసి, ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వానపల్లి గోవింద,
తండ్రి కళ్యాణం, డో.నెం.4-18,
జి.కోడూరు, మాకవరపాలెం మండలం,
అనకాపల్లి జిల్లా-531113
సెల్ : 7207541447

మురుగు నీరు పోయే దారేది?

రోడ్లు వేశారు.. డ్రెయినేజీ మరిచారు...



డ్రెయినేజీ లేకుండా నిర్మించిన రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ పరిధిలోని పతివాడ వారి కల్లాలకు పోయే రోడ్డులో మురుగు నీరు పోవడానికి వీలులేక మురుగు చెరువుగా తయారైంది. వేములవలస గ్రామపంచాయతీలో రోడ్డు వేసినప్పటికీ మురుగు నీరు పోయేందుకు కాలువలు నిర్మించలేదు. వేములవలస బిసి కాలనీ, సూర్య కిరాణా షాపు, హోండా షోరూం, శుభశ్రీ ఫంక్షన్ హాల్ తదితర షాపుల నుంచి వచ్చే నీరు తురకవాడ గెడ్డ ద్వారా పెద్దిపాలెం చెరువులో కలిసేది. ఇటీవల కాలంలో గెడ్డలు కబ్జాకు గురై మురుగు నీరు పోవడానికి కాలువలు లేక అధ్వానంగా తయారైంది.

గతంలో వేములవలస లిక్కర్ గొడౌన్ ప్రారంభానికి ముందు సర్వీస్ రోడ్డు వేసి పక్కన కాలువలు నిర్మించాలని గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ హామీకి పదేళ్లు అవుతున్నా అతీగతీలేదు. దీంతో బీసీ కాలనీ నుంచి వచ్చే నీరు మధ్యలోనే ఆగిపోయి మురుగు కూపంగా మారింది. వర్షాకాలం వస్తే మరీ అధ్వానంగా తయారవుతోంది. వేములవలస పంచాయతీ మార్కెట్ వేలం ద్వారా ఏడాదికి రూ.కోటిన్నరకుపైగా ఆదాయం వస్తున్నా సర్వీస్ రోడ్లు, కాలువలు ఏర్పాటుకు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగు నీరు పోవడానికి డ్రెయినేజీలు నిర్మించాలని వేములవలస పతివాడ వారి కల్లాల వాస్తవ్యులు, బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.



పతివాడవారి కల్లాలు సర్వీస్ రోడ్లు నిలిచిపోయిన మురుగు నీరు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో సోమవారం సాయంత్రం భీముని అప్పలనరస (65) అనే మహిళ పొలంలో గడ్డి కోస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పొలానికి గడ్డి కోసేందుకు వెళ్లిన అప్పలనరస ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుమారులు, కోడళ్లు కంగారుగా పొలానికి వెళ్లి గాలించారు. అప్పటికే విద్యుత్‌షాక్‌తో అమె మృతి చెందిఉండడాన్ని గమనించి పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.



భీముని అప్పలనరస



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు, మారుపేరు కార్మికులకు పిఎఫ్, పింఛను బకాయిలు చెల్లించాలని కాకాస, చిట్టివలస లేబర్ యూనియన్, జ్యూట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జ్యూట్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కాకాస కార్యాలయంలో సోమవారం ఉమ్మడిగా సమావేశమయ్యారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జెవి.కైలాష్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, బి.రామారావు, జి.ఆదినారాయణ, కె.ఈశ్వరరావు, రాంబాబు, ఎస్.అచ్చారావు, ఎంవి.గురుమూర్తి, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్‌లైన్లు ఏర్పాటుకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. రామవరం, జిఎస్.అగ్రహారం, యర్రవాని పాలెం, కనమాం, గండిగుండం, మామిడిలోవ తదితర ప్రాంతాల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బంక్ నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మిధిలాపురి వుడాకాలనీలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పనులను జివిఎంసి జోన్-2 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అడ్డుకున్నారు. నిబంధనల మేరకు ఎలాంటి అనుమతులు పొందకుండా ఈ బంకు నిర్మాణం చేపట్టడంతో పనులు నిలిపి వేయాలని ఇటీవల జివిఎంసి నోటీసులు జారీ చేసింది. అయినా సంబంధిత యజమాని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొంతమేర తాత్కాలికంగా తొలగించినట్లు సచివాలయ కార్యదర్శి భరత్ తెలిపారు.

హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను ఏయూ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎంవిఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబులు ముందుగా మెస్‌ల్లో భోజన నాణ్యత స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను రుచిచూసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లను తనిఖీ చేశారు.



మెస్‌లో రెక్టార్ కిశోర్‌బాబు

డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలకు సర్టిఫికెట్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) శాస్త్రవేత్తలకు ఆర్ అండ్ డి మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించింది. భారత్‌లోని 36 డిఆర్‌డిఒ ల్యాబ్‌లకు చెందిన 39 మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు పాల్గొనేవారికి శిక్షణ మాడ్యూల్స్, ప్రోగ్రామ్ ఫలితాల వివరాలు తెలియజేసారు. ఆర్ అండ్ డి మేనేజ్ మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సిమ్యులేషన్, ఆర్గనైజేషన్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ మేనేజ్ మెంట్, ఆర్ అండ్ డి ప్రాసెస్స్, ఆర్ అండ్ డి సపోర్ట్ ఫంక్షన్స్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, వాణిజ్యీకరణ, వినియోగం, ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీని పెంపొందించడం, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి కాన్సెప్ట్స్ అండ్ ప్రిన్సిపల్స్‌తో సహా వివిధ మాడ్యూల్స్‌ను ఈ ప్రోగ్రామ్ లో పొందుపరిచారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ (ఎన్ఎస్అండ్ఎం) డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. వివిధ డిఆర్‌డిఒ ప్రయోగశాలలలో శాస్త్రవేత్తల మధ్య బలమైన నెట్‌వర్క్‌ను పెంపొందించే ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిక్షణ పరిశోధన, అభివృద్ధిలో సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ హెడ్ క్వార్టర్స్ డైరెక్టర్ డాక్టర్ శైలేష్ కుమార్ సింగ్, ఐఐఎం విశాఖపట్నం ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న కంఫర్ట్ హోమ్ నివాసితులు

హత్యాచారాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-పెందుర్తి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను వ్యతిరేకిస్తూ జివిఎంసి 95 వార్డు పరిధి పురుషోత్తపురంలోని హెచ్‌బి.కాలనీ కంఫర్ట్ హోమ్స్ నివాసితులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని ప్లకార్డులు పట్టుకొని నినదించారు. ఈ సందర్భంగా నివాసితులు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, మహిళ వైద్యులకు రక్షణ చర్యలపై ప్రభుత్వాలు దృష్టిసారించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్.శ్రీనివాస్, ఎల్.సూర్యభాస్కర్, చిన్నారులు, మహిళలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

హోంమంత్రిగా అనిత వైఫల్యం

ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శాంతి భద్రతల నియంత్రణ, మహిళల రక్షణలో హోంమంత్రిగా వంగలపూడి అనిత పూర్తిగా విఫలమయ్యారని, ఆమె ఒక అసమర్థ హోం మంత్రి అని వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. సిరిపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, బాధ్యతల నిర్వహణలో విఫలమైన అనిత, తన హోదాను మరిచి అనుచిత విమర్శలు చేస్తూ, నిందలు వేస్తున్నారన్నారు. కనీస విజ్ఞత, గౌరవమర్యాదలూ వదిలేశారని ఆక్షేపించారు. రోజూ తమ పార్టీపైనా, జగన్మోహన్‌రెడ్డిపైనా విమర్శలు చేయడమే అనిత ఎజెండాగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఎక్కడిక్కడ హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసం కొనసాగుతున్నా హోంమంత్రి ఏనాడూ స్పందించలేదన్నారు. ముచ్చుమర్రిలో అత్యాచారానికి గురై అదృశ్యమైన బాలిక కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని గుర్తు చేశారు. అనితకు సన్మానాలపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని ఎద్దేవాచేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో ప్రమాద బాధితులను ఆదుకోవడంలోనూ, కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.



ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

ఎయు రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ధనుంజయరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు ఇఎన్.ధనుంజయరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులను స్వీకరించారు. ఎయు రెక్టార్‌గా ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణ, సీడీసీ డీన్‌గా ఆచార్య టివి.కృష్ణ, స్టూడెంట్ ఎఫైర్స్ ఇంచార్జి డీన్‌గా డాక్టర్ జి.రాంబాబు, ఎఇఆర్‌సి గౌరవ డైరెక్టర్‌గా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.వెంకటరమణ, స్టూడెంట్ ఎఫైర్స్ అసోసియేట్ డీన్‌లుగా డాక్టర్ ఎన్ఎం.యుగంధర్, డాక్టర్ ఎస్.హరనాథ్, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి.రామారావు, ఐఎఎస్ఇ ఇంచార్జి ప్రిన్సిపల్‌గా డాక్టర్ డి.నాగరాజకుమారిలు నియమితులయ్యారు.

బాధ్యతల స్వీకరణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఇఎన్.ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఆచార్య ధనుంజయరావు ఎయు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సుదీర్ఘ కాలం నుంచి సేవలందిస్తున్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవడం, జాతీయ స్థాయిలో ఎయు ఇమేజ్ పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రత్యేకం. ఆచార్య ధనుంజయరావు ప్రత్యేక చొరవతో ఎయు వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థులకు స్థానం కల్పించడం సాధ్యపడింది.

ఆచార్య ధనుంజయరావు గతంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఇంచార్జి వీసీగా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్, ఓఎన్‌జిసి, డిఎస్‌టికి సంబంధించిన విభిన్న ప్రాజెక్టులను ఆయన నిర్వహించారు.

రెక్టార్‌గా కిషోర్‌బాబు

ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు

రెక్టార్‌గా కిశోర్ బాబు నియామకం సీడీసీ డీన్‌గా టివి.కృష్ణ

ఎన్.కిషోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. ఆయన 30 సంవత్సరాల బోధన అనుభవం కలిగి ఉన్నారు. ఏయూ అకడమిక్ డీన్‌గా, రిజిస్ట్రార్‌గా, రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా గతంలో పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఏపి ఐసెట్ కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో 36 మంది పిహెచ్‌డిలు అందుకున్నారు. ఆచార్య కిషోర్ బాబు 11 పుస్తకాలను రచించారు, 60 కిపైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. ఐఎస్‌టిడి నేషనల్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నారు.

రిజిస్ట్రార్‌కు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన అభినందనలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఇఎన్.ధనుంజయరావును ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఘనంగా అభినందించింది. రిజిస్ట్రార్‌ను ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఎయు ఇంచార్జ్ కంటంరెడ్డి సూర్యనారాయణ, డాక్టర్ పట్నాయక్, డాక్టర్ రవి, డాక్టర్ సూర్యారావు, రమణ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రజలు

మాకు న్యాయం చేయండి

జుత్తాడ, వాలిమెరక ప్రజలు

ప్రజాశక్తి-పెందుర్తి : ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమ ఇళ్లను కూల్చొద్దని పెందుర్తి మండలం జుత్తాడ గ్రామం, వాలి మెరక పంచాయతీ ప్రజలు వేడుకుంటున్నారు. సోమవారం సాయంత్రం గ్రామస్తుతు మీడియాముందు తమన ఆవేదన వెలిబుచ్చారు. సర్వే నెంబర్ 58/2లోని ప్రభుత్వ భూమిలో గత 12 ఏళ్లుగా 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో తమకు పక్కా ఇళ్లు నిర్మించాలని గతంలో ప్రభుత్వాలకు, రెవెన్యూ రెవిన్యూ అధికారులకు ఆర్జీలు పెట్టుకున్నామని వివరించారు. గతంలో ఇక్కడ పాకలు వేసుకుని ఉండేవారిమని, తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో 6 ఏళ్ల క్రితం రేకుల షెడ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ఇప్పటికే ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని, పన్నులు కడుతున్న తమకు ఇళ్లను తొలగిస్తామని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నించారు. కూలి పనులు చేసుకొని చిన్నపిల్లలతో బతుకుతున్నామని, దయచేసి ప్రభుత్వం, పెద్దలు, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

బిల్డర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి : సిపిఐ

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి బృందావన్ కాలనీ సమీపంలో పూర్వి కన్‌స్ట్రక్షన్ పేరుతో బిల్డర్ నిర్మిస్తున్న భవనంలో వాటరింగ్ చేస్తూ మహిళ మృతిచెందినా ఎవరూ పట్టించుకోలేదని సిపిఐ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, వై.రాంబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఆ భవనానికి కాపలాదారులుగా విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన గొగాడ రమణ కాపలాదారునిగా పనిచేస్తున్నాడని, ఆదివారం సాయంత్రం వాచ్‌మ్యాన్ భార్య గోగాడ ఎర్రయమ్మ (43) భవనానికి వాటరింగ్ చేస్తున్న సమయంలో పిట్టగోడ కూలి పోవడంతో పైనుంచి ఆమె కింద పడిపోయిందని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత చాలా సేపటి వరకు బాధితురాలిని ఎవరూ పట్టించుకోలేదని, ఎటువంటి వైద్య సహాయమూ అందలేదని ఆరోపించారు. సుమారు గంట తర్వాత గోపాలపట్నంలోని బెహరా ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినా కనీసం భవన నిర్మాణదారుడు కానీ, స్థలం యజమానిగాని స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్‌చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 3వ తేదీన విశాఖలో నిర్వహించే కార్మిక ప్రదర్శనను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వామనమూర్తి, స్థానిక నాయకుడు రావికృష్ణ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వెంటనే ఆపాలని కోరారు. పాలకులు ఉచితాల పేరుతో కార్మికులకు రోజుల తరబడి ఉపాధి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్మిక, ఉద్యోగ, ప్రజా హక్కుల సాధన కోసం పోరాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.శంకర్, ఎస్.పాపారావు, పి.గణపతి, జి.సత్యం, డి.రాము, కవిత్రాజు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించే ప్రక్రియను విరమించుకొని, ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు మధ్య ఉండాల్సిన విభజన రేఖను చెరిపివేసే విధంగా రాష్ట్రంలోని అధికార కూటమి నాయకులు వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం, అధికార పదవులు నిర్వహించేవారి బాధ్యత అని తెలిపారు. సమస్యలు పరిష్కరించమని కోరుతూ ఏ రాజకీయ అభిప్రాయాలు లేనివారు, అనేక రాజకీయ అభిప్రాయాలు కలిగిన ప్రజలు అర్జీలు, ఫిర్యాదులు అందజేస్తారని వివరించారు. ప్రజాసమస్యల నివేదనకు ప్రభుత్వ కార్యాలయాలే తగిన వేదికలని, కనుక ప్రజల అర్జీలు, ఫిర్యాదులను ముఖ్యమంత్రి, మంత్రులు, సచివాలయం లేదా నిర్దేశిత ప్రభుత్వ కార్యాలయాలు, లేదా వారి క్యాంపు కార్యాలయాల్లో స్వీకరించాలని కోరారు. రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పార్టీతో పాలనను, ఫిర్యాదుల పరిష్కారాన్ని కలగాపులగం చేయడం తగదని పేర్కొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్ సిఐ చక్రధరరావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ సిఐ చక్రధరరావు అన్నారు. జివిఎంసి 57వ వార్డు దుర్గాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు చందాపు గుణేశ్వరరావు ఆధ్వర్యాన యువతకు, గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి, ధూమపానం, మద్యం తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. లాటరీలు, విలువైన బహుమతుల పేర్లతో సైబర్ నేరగాళ్లు విసిరే ఉచ్చుల్లో మహిళలు, యువత పడి డబ్బులు పోగొట్టుకోవద్దని హితవుపలికారు. మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధన తప్పనిసరిగా పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురికావద్దని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టంచేశారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డయల్ 100, 112, 1930 నెంబర్స్ యొక్క ఉపయోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దుర్గాపురం గ్రామ పెద్దలు దమ్ము గోవింద్, ఎస్పీ వెంకటరమణ, డి.మధు, కిట్టు, రెడ్డి, సూరి, బి.రాంబాబు, బ్లూకోర్టు కానిస్టేబుల్ డి.రాంబాబు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ చక్రధరరావు

దాట్లకు లోకేష్ అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టిడిపి యాప్ ద్వారా తెలుగుదేశం పార్టీ కంటెంట్‌ను ప్రజలకు విస్తృత స్థాయిలో షేర్ చేసి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచిన హితేష్‌రాజ్ వర్మ దాట్లకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియజేస్తూ పంపిన ప్రశంసాపత్రాన్ని విశాఖ దక్షిణ టిడిపి ఇంచార్జి సీతంరాజు సుధాకర్ సోమవారం దాట్లకు అందజేశారు. నగరంలోని ఎన్‌టిఆర్ భవనంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ, యువగళం పాదయాత్ర మొదలు, గత ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించే వరకు అనేక రకాలుగా పార్టీకి అండగా నిలిచిన దాట్ల వంటి కార్యకర్తల రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనిదన్నారు. నాటి ప్రభుత్వం ఎన్ని విధాలుగా కట్టడి చేయాలని చూసినా, చివరికి కేసులు పెట్టినా లెక్కచేయకుండా నిజాన్ని నిర్భయంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారని కొనియాడారు. ఇదే కృషిని కొనసాగిస్తూ, టిడిపి యాప్‌ను మరింతగా ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊరుకుటి నారాయణరావు పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లి ఖర్చులు అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 32వ వార్డు పరిధిలోని నూతన వధూవరులకు వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సమకూర్చిన పెళ్లి రిజిస్ట్రేషన్ ఖర్చులను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ద్వారా అందించారు. జనసేన నగర పార్టీ కార్యాలయంలో పెళ్లి కుమార్తె నీరజ, పెళ్లికొడుకు లక్ష్మణ్‌ను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ద్వారా వధువులకు బంగారు తాళిబొట్టు, పట్టు బట్టలు, మధు పరకాలు, పెళ్లికి, పెళ్లి రిజిస్ట్రేషన్ అయ్యే ఖర్చులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్వార్థంతో సేవలనందిస్తున్న డాక్టర్ కందుల నాగరాజును అభినందించారు. డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ, సేవే లక్ష్యంగా కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బయన సునీల్, జెర్రిపోతుల ప్రసాద్, వేణు, కందుల రాజశేఖర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, మంత్రి శాలివాహన, ఆదిబాబు, లుక్స్ గణేష్, కందుల బద్రీనాథ్, కందుల కేదారినాథ్, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో చేపలు మృత్యువాత

- భారీగా సముద్ర తీరంలోకి కొట్టుకొచ్చిన చనిపోయిన చేపలు
- ఫార్మా రసాయన వ్యర్థాల కాలుష్యమే కారణమని మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఫార్మా పరిశ్రమ వ్యర్థాలతో సముద్రజలాలు కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తమౌతోంది. ఫార్మా పరిశ్రమలలో విడుదలవుతున్న రసాయనిక వ్యర్థ పదార్థాల కాలుష్యంతో. పూడిమడక తీరంలోలో జెట్టి నిర్మాణానికి తలపెట్టిన ప్రాంతంలో వేలాది చేపలు చనిపోయి తీరానికి చేరాయి. కలిలి అనే ఈ చేపల విలువ కేజీ రూ.320 వరకుధర పలుకుతుందని మత్స్యకారులు అంటున్నారు. ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలతో ఒకవైపు కార్మికులు మృత్యువాత పడుతుండగా, వాటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పరిసర ప్రాంతంలో అనేకమంది ప్రజలు అస్వస్థతకు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇపుడు ఫార్మారసాయన వ్యర్థాలు సముద్రంలోకి వ దలడంతో పెద్దసంఖ్యలో మృత్యువాత పడి, తీరం కాలుష్యకారకం కావడంతోపాటు, వీటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని స్థానికులు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఫార్మా పరిశ్రమలతో తమకు ఎటువంటి ప్రయోజనం లేకపోగా, ఇలా అనేక విధాలుగానష్టం వాటిల్లడంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఫార్మా రసాయన వ్యర్థాలతో ఈప్రాంతంలో ఏదోఒకనాటికి మత్స్యసంపద పూర్తిగా అంతరించిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు బాధ్యత వహించే సముద్రంలో విడుదల చేస్తున్న ఫార్మారసాయనిక వ్యర్థ పదార్థాలను అరికట్టి, సముద్ర కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పూడిమడక తీరంలో ఒడ్డుకు కొట్టుకొచ్చిన చనిపోయిన చేపలు

కుక్కల బెడద నివారణకు తక్షణ చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి ఎంఇఒ స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కస్తూర్బా పాఠశాలలో కుక్కలహల్‌చల్‌పై సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మండల విద్యాశాఖ అధికారి బి కాశీ విశ్వేశ్వరరావు స్పందించారు. వెంటనే పాఠశాలలో పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో ఉపాధి హామీ నిధులతో కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టినా, నిధులు కొరతతో పూర్తి కాలేదని తెలిపారు. పాఠశాల వెనుక భాగంలో గత ప్రిన్సిపాల్ గోడ నిర్మాణం చేపట్టారని తెలిపారు. మిగిలిన ప్రదేశంలో ఫెన్సింగ్ వేశారని తెలిపారు. పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో వీధి కుక్కలు కస్తూరిబా పాఠశాలలో వస్తున్నాయని తెలిపారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, ప్రహరీ పూర్తి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. అంతవరకు రేయింబవళ్లు దీనిపై దృష్టి పెట్టేలా వాచ్‌మ్యాన్‌ను నియమిస్తామని, కుక్కలు పాఠశాలలోకి చొరబడితేవెంటనే వాటిని బయటకు తరిమేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫార్మా బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న సిపిఎం నేత కోటేశ్వరరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఫార్మా ప్రమాద బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అచ్యుతాపురంలో మాట్లాడుతూ.. ఫార్మా పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాద సంఘటనలన్నీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనేనని చెప్పారు. వాటికి బాధ్యత యాజమాన్యాలదే అన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వలన పనిచేసే కార్మికులను హత్యకు గురవుతున్నారని, ప్రమాదాలకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీనర్జిన్ ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు కార్మికులకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించిన నేపథ్యంలో పరిహారంతో పాటు బాధిత కుటుంబీకులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్ రాము, కె. సోమినాయుడు బుద్ద రంగారావు పాల్గొన్నారు.

కొండలరావు సేవలకు అభినందన



సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-దేవరాపల్లి: పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'మన టిడిపి' యాప్ ద్వారా పార్టీ చేపట్టిన కార్యక్రమాలను, అప్పటి వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలలోకి తీసుకువెళ్లిన పార్టీ నాయకులు మాడుగుల నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన గట్రెడ్డి కొండలరావు (జి.కె)ను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సన్మానం చేసి ప్రశంసా పత్రం అందజేశారు. కొండలరావు సేవలను గుర్తిస్తూ ఎమ్మెల్యే బండారు అభినందించారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షులు అదిపల్లి జగ్గారావు, పార్టీ కార్యదర్శి ఉండూరు దేముడు, క్లస్టర్ ఇంచార్జిలు పుప్పాల రమేష్, భీశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరవధిక దీక్ష భగ్నంపై నిరసన

- నేతల హామీలతో వెనక్కు తగ్గిన నిర్వాసిత మత్స్యకారులు
- సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక



రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న నిర్వాసిత మత్స్యకారులు

ప్రజాశక్తి- రాంబిల్లి : నేవీ ప్రహరీ నిర్మాణంతో జీవనాధారం కోల్పోవడంతో పాటు గ్రామాలకు రక్షణలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని ఆరు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న మాజీ ఎంపిటిసి రావి దేముళ్లును అర్థరాత్రి వేళ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. రాంబిల్లి మండలం, పెద్ద కలవలపల్లి వద్ద ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వాహనాలన్నీ స్తంభింపజేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో, స్థానిక సిఐ సిహెచ్ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు పెద్దఎత్తున నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద కలవలపల్లి వద్ద ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన సిపిఎంమండల కన్వీనర్ దేముడునాయుడు మాట్లాడుతూ నేవీ ప్రహరీ నిర్మాణంతో ఉపాధి దూరమవ్వడమే కాకుండా, పశువులకు మేత, జిరాయితీ భూములకు రహదారి స్తంభన, శారదానది పొంగితే సురక్షిత కొండ ప్రాంతానికి చేరుకోవడానికి మార్గం లేకుండా పరిస్థితులు కల్పిస్తున్నారని 300 రోజులుగా స్థానికులు వివిధ రూపాల్లో ఆందోళన చేసినా కేంద్రమంత్రిగానీ, ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో స్థానిక మాజీ ఎంపిటిసి రావి దేవుళ్లు ఆరురోజులుగా నిరవధిక దీక్షకు దిగారన్నారు. ఆరురోజులుగా నిరాహారదీక్షతో దేముళ్ళ ఆరోగ్యం క్షీణిస్తున్నా, అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని ఆందోళన చెందుతున్న పరిస్థితుల్లో ఆదివారం అర్ధరాత్రి దేముళ్ల ఆరోగ్యం క్షీణిస్తోందని, అతని వైద్యపరీక్షలు అవసరమన్న నెపంతో దీక్షభగ్నం చేసి, తరలించుకుపోవడం దుర్మార్గమన్నారు. దీక్ష భగ్నం కాకుండా, వారి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

దీంతో స్థానికులు ఆందోళనకు దిగడంతో మాజీ ఎంపిపి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దినబాబు, జనసేన మండల అధ్యక్షులు, పి నూకన్న దొర, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ధర్నా శిబిరంవద్దకు వచ్చి నిరసనకారులతో మాట్లాడారు. 15 రోజుల్లో ఎమ్మెల్యే సమక్షంలో ఉన్నతాధికారులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించే చర్యలు చేపడతామన్నారు. అప్పటివరకు ప్రహరీ నిర్మాణం నిలుపుదల చేస్తారని, అరెస్టు చేసిన రావి దేముళను బేషరతుగా విడుదల చేస్తారని హామీ ఇచ్చారు. దీంతో రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న ఆందోళనకారులు,నేతల మాటను నమ్మి ఉద్యమాన్ని ఇక్కడ విరమించి, రామాలయం వద్ద కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కర్రి ప్రసాద్, మాజీ సర్పంచ్ తాతబాబు, చిన్న కలవలపల్లి సర్పంచ్ వై శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గణేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల నిర్వాహకులు

ప్రజాశక్తి - యలమంచిలి : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ప్రభుత్వ మద్యం షాపుల నిర్వాహకులు సోమవారం యలమంచిలిలో ఆందోళన చేపట్టారు. దిమిలిరోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమై, రెండు నెలలుగా తమకు జీతాలు ఇవ్వలేదని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటరమణ మాట్లాడుతూ ఎపి ఎస్‌బిఎల్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నిరసన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 3,500 దుకాణాల్లో సుమారు 15వేల మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు. నూతన మద్యం విధానంలో పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యలమంచిలి సర్కిల్ మద్యం దుకాణ ఉద్యోగులు రాంబాబు, శివ, రామకుమార్, నాని పాల్గొన్నారు,

11న అరసం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనకాపల్లి జిల్లా శాఖ మహాసభ వచ్చేనెల 11వ తేదీన శాఖా గ్రంథాలయంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు తెలిపారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన అనకాపల్లి జిల్లా అరసం కమిటీ సమావేశంలో కన్వీనర్‌గా పాల్గొన్నారు. మహాసభలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కోకన్వీనర్ బల్లా నాగభూషణం, లైబ్రేరియన్ కొసనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండకర్లలో లారీ బోల్తా

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న బెంజ్ లారీ సోమవారం కొండకర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సహాయంతో డ్రైవరును బయటకు తీసి, చికిత్సకు తరలించారు. ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాలకు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా మారడం ఒకకారణమైతే, వాహనదారుల అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ మరో కారణమని స్థానికులు మండిపడుతున్నారు. వీటిని నియంత్రించే చర్యలు లేకపోవడం దారుణమని అంటున్నారు.



కొండకర్లలో బోల్తా పడిన లారీ

మదర్ థెరిసాకు ఘననివాళి



మదర్ థెరిసాకు ఘననివాళి సిద్ధార్థ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్దార్ధ సోషల్ సర్వీస్‌కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం భారతరత్న మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయ జంక్షన్‌లో మదర్ థెరిస్సా విగ్రహానికి పట్టణ దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పి.రాములమ్మ పూలమాల వేసి ఘన నివాళి లర్పించారు. అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమములో కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల క్రిష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు,సభ్యులు ఉడా నాగేంద్రరావు, ఎమ్.వరలక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : పలుచోట్ల మదర్ థెరీసా జయంతిని ఆదివారం నిర్వహించారు. స్థానిక జీసెస్ పార్కు వద్ద ఆమె విగ్రహానికి మదర్ థెరీసా అవార్డు గ్రహీత, న్యాయవాది కెఎస్‌ఎం.సుధాకర్ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు దత్తి ఈశ్వరరావు, కె.ముత్యాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన ఇదే పార్కు వద్ద మదర్ థెరీసా జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు కొక్కిరి అప్పన్న, కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్, ఎస్.జోగారావు, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇన్‌ఛార్జిగా మల్లువలస

ప్రజాశక్తి- కె.కోటపాడు: ఉమ్మడి విశాఖ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇన్‌ఛార్జిగా మండలంలోని మేడిచర్ల గ్రామానికి చెందిన మల్లువలస సూర్యనారాయణను సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు నియమించి, నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. తనకు అప్పగించిన పనిని అంకితభావంతో చేస్తానన్నారు.



మల్లువలస సూర్యనారాయణ

నేడు పోతురాజుబాబు పండగ

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని నాగులపల్లి గ్రామంలో పోతురాజుబాబు పండగను ఈనెల 27న మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు పెతకంశెట్టి రాజునాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ దొడ్డి బుజ్జి సోమవారం తెలిపారు. పండుగ సందర్భంగా పోతురాజుబాబు ఆలయంతోపాటు గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం పురవీధుల్లో ఘటాల ఊరేగింపు, రాత్రికి ప్రధాన కూడళ్ల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు భరత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట, అనకాపల్లిలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు, అభిమానులు తెలిపారు ఈ సందర్భంగా కేకు కటింగ్‌తోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.



మలసాల భరత్ కుమార్

రూ.45 లక్షల విలువైన 912 కిలోల గంజాయి పట్టివేత

- లారీ, నాలుగు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్, మరో ఐదుగురు పరారీ
- గంజాయి నియంత్రణకు పటిష్ట నిఘా : ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి- అనకాపల్లి : కొత్తవలస నుంచి సబ్బవరం వైపు అక్రమంగా లారీలో తరలిస్తున్న సుమారు రూ.45 లక్షల విలువచేసే 912 కిలోల గంజాయిని ముందస్తు సమాచారంతో సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. లారీతోపాటు రూ.15 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్‌పి దీపిక వివరాలను వెల్లడించారు. ఒడిశా మల్కన్‌గిరి నుంచి కొత్తవలస మీదుగా సబ్బవరంలోకి గంజాయితో లారీ ప్రవేశిస్తుండగా గుల్లేపల్లి వద్ద సబ్బవరం ఎస్‌ఐ ధనుంజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది లారీలు తనిఖీ నిర్వహించి, లారీలో ప్రత్యేకంగా తయారు చేసిన క్యాబిన్‌లో ఉంచిన గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. నిందితుల్లో తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా కొండాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ బారావత్ తరుణ్, ఒడిశా రాష్ట్రానికి చెందిన సేతి మల్లేశ్వరరావులను అరెస్టు చేశారు. మరో ఐదుగురు తప్పించుకుపోయారన్నారు. ఈ కేసులో లారీ, సెల్ ఫోన్లు, నగదు తో కలిపి మొత్తం రూ.55.75లక్షల విలువ గల 912 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి వందరోజుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డిజిపి ద్వారక తిరుమలరావు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా మార్గాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టామన్నారు. అలాగే జిల్లాలో స్పెషల్ యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ టోల్‌గేట్లు, చెక్‌పోస్టులు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా సాగుతున్న నేపథ్యంలో అక్కడి పోలీసు అధికారులతో సమన్వయంతో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. ఈ సందర్భంగా గంజాయిని పట్టుకున్న పోలీసులను అభినందించిన జిల్లా ఎస్‌పి దీపిక, వారికి నగదు రివార్డులను అందజేశారు. మీడియా సమావేశంలో ఎస్‌బి డిఎస్‌పి బి.అప్పారావు, పరవాడ డిఎస్‌పి కె.వి.సత్యనారాయణ, సబ్బవరం ఎస్‌ఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐ ధనుంజయ్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయి, నిందితులతో జిల్లా ఎస్‌పి దీపిక, ఇతర పోలీస్ అధికారులు

గోవాడ సుగర్స్‌ను ఆధునికీకరించాలి

ఎంపీ రమేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి - చోడవరం / రూరల్ : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి, పూర్వవైభవం తెస్తామన్న అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ ఎన్నికల హామీని నిలబెట్టు కోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేసారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఫ్యాక్టరీపై ఆధారపడి వెయ్యి మంది కార్మిక కుటుంబాలు, 24 వేలమంది సభ్యరైతులు ఉన్నారని, సహకార రంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా ఉన్న చోడవరం (గోవాడ చక్కెర కర్మాగారం పరిస్థితి నేడు అధ్వానంగా తయారైందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మన పంచదారకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, ఇక్కడ నుంచి ఎగుమతులు నిలిచిపోవడం, ఇక్కడ ఉత్పత్తి వ్యయం మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉండడంతో ఏఏటికాయేడు నష్టాల ఊబిలో కూరికుపోతోందన్నారు. ఏడాదికి 5.50లక్షల టన్నులు చెరకు క్రషింగ్ చేసే గోవాడ సుగర్స్ నేడు 2 లక్షల టన్నులు కూడా ఆడడం లేదన్నారు. గత సీజన్‌లో కేవలం లక్షా 71 వేల టన్నులు చెరకు మాత్రమే గానుగ ఆడిందన్నారు. రైతులకు సకాలంలో పేమెంట్లు చేయక పోవడంతో చెరకు పంట సాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గి పోతోందని, అంతే కాక విపరీతంగా పెరిగిన పెట్టుబడుల వ్యయం, మద్దతు ధర ఇవ్వక పోవడంతో రైతులు నిరాశతో ఉన్నారన్నారు.

కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించక పోగా, అన్‌సీజన్ పేరుతో 250 మంది ఎస్‌ఎంఆర్, ఓచర్ పేమెంట్ కార్మికులను రోడ్డున పడేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార రంగంలో 13 సుగర్ ఫ్యాక్టరీలు ఉండగా, ఇపుడు కేవలం గోవాడ సుగర్స్ మాత్రమే నడుస్తోందని, జిల్లా పరిధిలోని నాలుగు చక్కెర ఫ్యాక్టరీల్లో ఇదొక్కటే తెరిచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో గోవాడ సుగర్స్ కూడా మూతబాట కట్టకుండా, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని నెరవేర్చడం ద్వారా గోవాడ సుగర్స్‌కు పునరుజ్జీవం ఇచ్చే చర్యలను ఎంపీ సిఎం రమేష్ చేపట్టాలని కోరారు. సిఎం రమేష్ ఇచ్చిన హామీని విశ్వసించి, అతనిని మంచి మెజార్టీతో జిల్లా వాసులు గెలిపించారన్న విషయాన్ని గుర్తించాలని కోరారు.

సంక్షోభంలో ఉన్న రైతు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని, అనకాపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ఫార్మాకంపెనీల్లో ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు గాల్లో దీపంలా ఉన్న పరిస్థితుల్లో, ప్రాణాంతక ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని మానుకుని, ప్రజాప్రయోజనకర పరిశ్రమలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు.

యూనిఫైడ్ పెన్షన్‌కు వ్యతిరేకం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్స్ స్కీమ్‌కు తాము వ్యతిరేకమని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెకెఎల్‌ఎన్ ధర్మారావు, ఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి సర్కార్ ప్రవేశపెట్టిన జిపిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుపిఎస్‌కు తేడా లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం కల్లిబొల్లి మాటలతో కాలక్షేపం చేయరాదని , పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వర్షంతో ఊపందుకున్న వరినాట్లు

ప్రజాశక్తి- బుచ్చయపేట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా మబ్బులతో అడపాదడపా చిరుజల్లులు కురున్నాయి. పూర్తిస్థాయిలో వర్షాలు కురకపోవడంతో, వరి సాగుకు అంతగా ఉపయోగం లేని పరిస్థితి ఉంది. అయితే సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో పంటపొలాల్లోనూ, సాగునీటి వనరుల్లోనూ నీరు చేరింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు కొంతమంది రైతుల దమ్ములు చేస్తున్నారు. వరి నాట్లు వేస్తున్నారు

సమాజ సేవకులకు 'మదర్ థెరిసా' అవార్డులు



అబ్దుల్ కలాం అవార్డు స్వీకరిస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి - సబ్బవరం: మండల కేంద్రంలో స్థానిక జోడుగుళ్ళకు చెందిన బంగారు తల్లి సేవాసమితి సంఘం అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావుకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు లభించింది. సోమవారం మదర్ థెరీసా జయంతి సందర్భంగా విజయవాడలో మదర్ సర్వీస్ సొసైటీ ఈ అవార్డును అందజేసింది విజయవాడలోని గాంధీనగర్‌లో అక్కినేని నాగేశ్వరరావు కళావేదికలో వెంకటరావు ఈ అవార్డును స్వీకరించారు. వివిధరంగాల్లో స్వచ్ఛందసేవ చేస్తున్న ఏడు రాష్ట్రాలకు చెందిన 180మంది ప్రముఖులను గుర్తించిన మదర్‌థెరిసా సేవా సొసైటీ, అంబేద్కర్, అబ్దుల్ కలాం, నందమూరి తారక రామారావు, మదర్ తెరిసా, జ్యోతిరావు పూలే పేరిట జాతీయఅవార్డులు అందజేస్తోంది. వీటిల్లో భాగంగా సింగంపల్లి వెంకటరావుకు మదర్ థెరిసా సొసైటీ అధ్యక్షుడు, మల్లాది ప్రసాదరావు, వెంకటరావుకు అబ్దుల్ కలాం అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమం బంగారు తల్లి సేవాసమితి సభ్యులు గొంప ప్రసాదు, కోన నూకరాజు, గెడ్డం సూరిబాబు, సూరెడ్డి నాగరాజు, జెట్టి శ్రీను పాల్గొన్నారు.



అంబేద్కర్ జాతీయ సేవారత్న అవార్డు స్వీకరిస్తున్న ఎండి రాజ్

పరవాడ: విజయవాడలోని ఠాగూరు పౌర గ్రంథాలయంలో మదర్ సర్వీస్ సొసైటీ రెండవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి అవార్డులు అందజేశారు. మండలంలోని ఇ-బోనంగి గ్రామానికి చెందిన ఎండి రాజ్‌కు అంబేద్కర్ జాతీయ సేవా రత్న అవార్డు అందజేశారు. దీనిపై రాజ్ స్పందిస్తూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

మరుగుదొడ్డి వద్ద తుప్పల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మొక్కల మాటున మరుగుదొడ్డి పేరుతో సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందన వచ్చింద. పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, సిబ్బంది స్పందించారు. మరుగుదొడ్డి వద్ద ఉన్న తుప్పలను తొలగించారు. దీంతో, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణ, గ్రౌండ్లో ఉన్న తుప్పలను తొలగించాలని వారు కోరుతున్నారు.



తుప్పలు తొలగిస్తున్న కూలీ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కోటవురట్లలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : చిట్టివలసలో గ్రామ పెద్దలు రంగూరి సీతారామదొర, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యాన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, విజయరాంపురం కమిటీ ఆధ్వర్యాన భీమిలి మండలం దాకమర్రిలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ వరకు వేడుకలు జరుగనున్నాయని కమిటీ అధ్యక్షులు కె.త్రినాధరావు తెలిపారు. జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, భీమిలి, డెంకాడ ఎంపిపిలు వాసు రాజు, వాసుదేవరావు, దాకమర్రి ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, సర్పంచులు పైడప్పడు, జివి.నారాయణ, కమిటీ సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, వి.సురేష్ పాల్గొన్నారు.

డొకరపేట గ్రామంలో గుడిలోవ, విజ్ఞాన విహార ఆధ్వర్యాన శ్రీకృష్ణ వేషధారణ పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జెడ్పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ పాల్గొన్నారు.

ఆరిలోవ : 12వ వార్డు పెదగదిలి బాలమురళీ సేవా సంఘం ఆధ్వర్యాన శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, బుడుమూరు గోవింద్, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, బాలమురళీ సంఘం సభ్యులు పాల్గొన్నారు. 10వ వార్డు ఆదర్శనగర్లో లిటిల్ కిడ్స్ ప్లేస్కూల్లో చిన్నారులు శ్రీకిష్ణుని వేషాధారణలో వచ్చి సందడి చేశారు.

ఆనందపురం : గంభీరం ఐఐఎం సమీపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు డాక్టర్ నిష్క్రించిన భక్త దాస ఆధ్వర్యాన కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి బొట్టవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, గణేష్ నగర్ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : నగరంలోని జిల్లా పరిషత్ జంక్షన్లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చైతన్య బ్రదర్స్ శిష్య బృందం లలిత సంగీతంతో భక్తులను అలరించింది. త్రిదండి స్వామి భక్తి సౌధా కేషవ గోస్వామి మహారాజ్ సందేశమిచ్చారు. ఆలయ నిర్వాహకులు ప్రద్యున్మాదాస్ పాల్గొన్నారు.

కిడ్స్ గార్డెన్స్లో..

ఎంవిపి.కాలనీ : కృష్ణాష్టమి వేడుకలు ఎంవిపి.కాలనీలోని కిడ్స్ గార్డెన్స్ స్కూల్లో ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాల్సిన అవసరముందన్నారు. శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

దేవరాపల్లి: మండల కేంద్రంలోని కృష్ణుడు ఆలయం వద్ద యాదవ యూత్ సంఘం, పెద్దలు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు ప్రత్యేక పూజలు జరిపారు. భారీ అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని వడ్డించారు. ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు అప్పలరాజు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ దేవుళ్ళ పాల్గొన్నారు.

కశింకోట : యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కోనేరు గట్టు వద్ద శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. సిఐ అల్లు స్వామినాయుడు పాల్గొని అన్నసమారాధన ప్రారంభించారు.మాజీ వైస్ ఎంపిపి వేగి గోపికృష్ణ, మాజీ ఎంపిపిలు పంచదార లక్ష్మీ సూరిబాబు, పెంటకోట సుబ్బలక్ష్మి రాము, డిసిజిబి మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, త్సవ కమిటీ సభ్యులు పంచదార సూరిబాబు ఏదుర అప్పలరాజు, అప్పారావు, దాకారపు శ్రీనివాసరావు, పళ్ళ ఈశ్వరరావు, సత్యారావు పాల్గొన్నారు.

మునగపాక: సంతబయలు శ్రీకష్ణ దేవాలయంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు, ఆలయ నిర్వహకులు స్వామి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.



వేషధారణతో ఆకట్టుకున్న సాన్విసాయి

సబ్బవరం: మండలంలోని, గోపాల్నగర్ శ్రీకష్ణ మందిరంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు, టిడిపి ఇన్ఛార్జి గండి బాబ్జి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గోపాల్నగర్ యూత్, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉట్ల సంబరం, కోలాటం నిర్వహించారు. జనసేన నాయకులు ఇందుల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, బలిరెడ్డి రామకష్ణ, మామిడి శంకరరావు, శరగడం రాము, రోమాల చంద్రశేఖర్, తెలుగుదేశం నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాలనాయుడు, కోరాడ శ్రీనివాసరావు, బర్ల రమణ,కోన సోమేశ్వరరావు,పల్లా తాతారావు , కొయ్య వెంకటరమణ, బంతి కోళ్ల పద్మ ,శిరీష,వైసిపి నేత పల్లా కృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం మండలకేంద్రంలోని ప్రతిభ విద్యాలయంలో రస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ఆధ్వర్యంలో శ్రీకష్ణ జన్మాష్టమి సంబరాలు కోలాహలంగా జరిగాయి. ప్రీప్రైమరీ విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికలు వస్త్రధారణలో సందడి చేశారు. నృత్య గానాలతో అలరించారు. ప్రిన్సిపాల్ ఆన్సీ జోసెఫ్, ఆదిరెడ్డి శరత్ తేజ ,ఆదిరెడ్డి తేజశ్రీ,, కనకమాలక్ష్మి పాల్గొన్నారు



కిడ్స్ గార్డెన్లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



దాకమర్రిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో వెంకటప్పడు

పరవాడ : స్థాఇనిక సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధాకష్ణుల, గోపికల వేషధారణలతో విద్యార్థులు అలరించారు ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు అరుణ, లీలా, ఉమా, మోనాలిసా, శ్రీదేవి, సిఇఒ నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

కె. కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి, గరుగుబిల్లి, సూది వలస, ఆర్ వై అగ్రహారం, గవరపాలెం, పింద్రంగి, సింగన్నదొరపాలెం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా అన్నసమారాధనలు నిర్వహించారు.

అనకాపల్లి: తుమ్మపాలలో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట వీధి శ్రీకృష్ణ ఆలయంలో జన్మాష్టమి వేడుకలు జరిగాయి. ఎంపిటిసి పంచదార్ల కన్నా రావు , వియ్యపు సింహాచలం, వాయిబోయిన అర్జునాయుడు, వియ్యపు నూకరాజు, వాయిబోయిన ఈశ్వరరావు, నుడగల వెంకట అప్పారావు,కొయ్య ప్రసాద్, కొయ్య జ్యోతి, వియ్యపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం, మోసయ్యపేట, మల్లవరం కొండకర్ల గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. అన్నసమారాధనలు నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి, జానకయ్యపేట, చినదొడ్డి గల్లు,దేవవరం, డిఎల్ పురం, గొడిచెర్ల, ఉపమాక పంచాయతీ శివారు మామిడివానిపాలెం, కొర్ర వానిపాలెం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. వేడుకలు పురస్కరించుకుని పలు గ్రామాల్లో భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు.

కోటవురట్ల:మండలంలో పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటవురట్లలో సినిమా హాల్ సెంటర్కు వెళ్లే దారిలో కృష్ణుడి గుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాపురం గ్రామంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, జానకి శ్రీను, హరిబాబు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రహదారులు అస్తవ్యస్తం

-అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: కోటవురట్ల నుంచి అడ్డు రోడ్డు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు పూర్తి కావస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. దీంతో, అడ్డురోడ్డు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పందూరు నుంచి అడ్డరోడ్డు వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. గోతుల మయం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఇందేసమ్మ వాక సమీపంలో ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో కొండ చరియలు సైతం విరిగి పడుతున్నాయి. అధికారులకు గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టినా పట్టించుకోలేదని పలువురు ఆరోపించారు. ఈ సమస్యను కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



భయంగా వెళుతున్న వాహనదారుడు

బిఎన్ రోడ్డుకు గండి


ప్రజాశక్తి-కొత్తకోట:ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దొండపూడి పెద్ద చెరువు వద్ద బిఎన్ రోడ్డులో గండి పడటంతో సోమవారం ఉదయం నుంచి వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనిపై స్పందించిన కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు ఈ రోడ్లో పడిన గండిని తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. స్టాపర్లు ఏర్పాటు చేసి వాహనాల క్రమ బద్ధీకరణ చేపట్టారు. రోడ్డు గండి పడటంతో చెరువు దిగువు భాగంలో ఆయకట్టు భూములు ముంపునకు గుర య్యాయి. తక్షణమే గండికి మరమ్మతులు చేపట్టక పోతే దిగువ ఉన్న వరి పంటకు తీవ్ర ప్రమాదం ఏర్పడు తుందని ఆయుకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...



గండిని పరిశీలిస్తున్న పోలీసులు

వరాహ నదిలో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ఆదివారం పందూరు వద్ద వరహానదిలో గల్లంతైన సుంకర పెద పోతురాజు మృతదేహం సోమవారం ఉదయం బయటపడింది. గ్రామస్తులతో పాటు వేములపూడి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్ల సహకారంతో నదిలో గాలించారు. గల్లంతయిన ప్రదేశం సమీపంలోనే మృతదేహం లభ్యమైంది. గాలింపు కోసం స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది చొరవ తీసుకున్నారు మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించి కన్నీటి పర్యంతమయ్యారు. సహాయక చర్యల్లో ఏఎస్ఐ గంగరాజు, స్థానిక వీఆర్వో ఆశారత్నం, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ధ్వంసమైన విద్యుత్ పరికరాలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో.. ఆసుపత్రిలో మంటలు

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విద్యుత్ సహాయకుడు లక్ష్మణరావుకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో మంటలు చెలరేగడంతో పాటు దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రిలో పొగ కమ్ముకోవడంతో బాలింతలు, రోగులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న విద్యుత్తు సహాయకుడు గుల్లేలి లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ షాక్ కు గురైన లక్ష్మణరావుకు స్థానిక ఆసుపత్రి వైద్యాధికారులు ప్రథమ చికిత్స అందించారు.

ఇదిలా ఉండగా బ్రిటీష్ కాలం నాటి ఆసుపత్రి కావడంతో ప్రతిసారి విద్యుత్ మరమ్మత్తులకు గురవుతోంది. దీంతో మరమ్మత్తులు చేస్తూ విద్యుత్ సహాయకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన ప్రదేశానికి సమీపంలోనే నవజాత శిశువుల వార్డు ఉంది. ఇటువంటి సంఘటనలు పునరావృతమయితే నవజాత శిశువుల వార్డులోని శిశువులతో పాటు బాలింతలు, సహాయకులు ప్రమాదానికి గురైయ్యే అవకాశాలు లేకపోలేదని ఈ ప్రాంతీయులు, ఆసుపత్రి రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాయాలతో చికిత్స పొందుతన్న లక్ష్మణ్



రోడ్డును అనుకుని ఉన్న భారీ వృక్షం

రోడ్డుపై ప్రమాదభరితంగా చెట్లు

-భయాందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో నర్సీపట్నం- కోటవురట్ల ప్రధాన రహదారిని అనుకొని ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు నేల కూలాయి. వాటిని తాత్కాలికంగా తొలగించిన అధికారులు పూర్తిగా తొలగించక పోవడంతో రోడ్డుకు సగభాగం ఆనుకుని ఉన్నాయి. ఎండపల్లి, జల్లూరు గ్రామాల వద్ద నేల కొరిగిన చెట్లు పూర్తిగా తొలగించకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఏ క్షణాన్ని ఏ ప్రమాదం ఉంచుకోవాలని ఆందోళన చెందుతున్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును ఆక్రమించుకొని ఉన్న చెట్లను పూర్తిగా నిర్మూలించాలని కోరుతున్నారు.

రహదారి లేక అవస్థలు

-అమలు కాని గత ప్రభుత్వ హామీ
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని రొంగలపాలెం పంచాయతీ శివారు గ్రామమైన కాముడిపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన పెంటకోట అప్పారావు, రాపేటి రమణ తదితరులు కోరారు. ఈ మేరకు విలేకర్ల వద్ద తమ గోడును వెల్లడించుకున్నారు. 2001లో కుసర్లపూడి పంచాయతీ శివారు గ్రామంగా ఉన్నప్పుడు పనికి ఆహార పథకంలో జానకిరాంపురం నుండి కాముడిపాలెంనకు ఇక్కడ నుండి నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామం పాకల వద్దకు మెటల్ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దీనిపై ఏ నాయకుడు దృష్టి సారించలేదు. 2019లో ఇదే గ్రామంను ఆనుకొని ఉన్న మామిడితోటలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ ఐదేళ్ల రహదారికి నిధులు మంజూరు చేయలేదు. ఈ ఏడాదిలో ఏప్రిల్ ఎన్నికల్లో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రోడ్డు సమస్యపై హామీ ఇచ్చారని, త్వరగా నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చి మాకు అన్యాయం చేశారు. మమ్మల్ని మరిచిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాజు అయినా తమకు న్యాయం చేయాలి. రోడ్డును నిర్మించాలి.



రాపేటి రమణ,
కాముడిపాలెం గ్రామం

సొంత డబ్బులతో కొంత మేర పనులు

దగ్రాల రాఘవేంద్రరావు తోట వరకు సుమారు ఒక కిలో మీటరు దూరం వరకు గ్రామస్థులు కలిసి గ్రావెల్ వేసుకోవడం జరిగింది. తామంతా కొంత నిధి ఏర్పాటు చేసుకున్నాం. రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి ఎప్పటి నుంచో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలి



రాపేటి అప్పారావు
కాముడిపాలెం గ్రామం

విద్యార్థుల కుటుంబాలకు.. రూ.కోటి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -చింతపల్లి : అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ఘటనలో మృత్యువాత పడిన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించడం శుభ పరిణామమని, అదే విధంగా కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేట్ క్రిస్టియన్ మిషనరీ వసతి గృహంలో విషాహారం తిని మృతి చెందిన బాధిత కుటుంబాలకు అదే విధంగా చెల్లించాలని చింతపల్లి, కొయ్యూరు జెడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, వార నూకరాజులు కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ సంఘటన ఏ విధంగా జరిగినా మృతులు మనుషులే కదా... అని వారు ప్రశ్నించారు. గిరిజనులంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి చులకన చూపుగా ఉందని వారు మండిపడ్డారు. విద్యార్థుల కుటుంబాలకు కూడా కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రజా సంఘాలతో కలిని ఉద్యమిస్తామని హెచ్చరించారు.